క్లుప్తంగా

2 నుంచి క్రికెట్ పోటీలు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలో హోలీ పర్వదినం సందర్భంగా హాతీరాం బాబాజీ అండ్ సంత్ సేవాలాల్ భక్త సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 2 నుంచి 5వ రకు ఏపీ, తెలంగాణా రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే టీమ్‌లు తమ ఎంట్రీలను ఈ నెల 28లోపు భుక్యా గోపినాయక్ 77299 57972, నానూవత్ మేగినాయక్ 63014 83293 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ పోటీలను వేంకటేశ్వరస్వామి దేవస్థానం సత్రాల వద్ద నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.30,116, రూ.20,116, రూ.15,116లు చతుర్ధ, పంచమి, ఆరోవ బహుమతులుగా వరుసగా రూ,10,116, రూ.5,116, రూ.3,116లను అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శీనన్నతోనే మా పయనం

మధిర: రాబోయే రోజుల్లో ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శీనన్న తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటూ రాజకీయంగా ఆయనతోనే పయనిస్తామని మధిర మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకులు తాంత్ర జ్యోతి తిరుమలరావు దంపతులు తెలిపారు. కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో ఆదివారం పొంగులేటి నివాసంలో ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. మధిర మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్‌గా గతంలో పనిచేశానని, భవిష్యత్ రాజకీయాల్లో శీనన్న వెంట కలిసి నడిచేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తన వెంట ప్రయాణించే అభిమానులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని శీనన్న హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రముఖ వైద్యుడు కోట రాంబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎర్రగుంట లక్ష్మి రమేష్ సహకారంతో శీనన్న మార్గంలో కొనసాగుతామని పేర్కొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కల్లూరు రూరల్: మండలంలోని పేరువంచ గ్రామ పంచాయతీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించతల పెట్టిన సీసీ రోడ్లను ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ సభ్యుడు కట్టా అజయ్‌కుమార్, సర్పంచ్ అంకిరెడ్డి అనూష ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పు ప్రసాద్, అంకిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎర్రుపాలెం: మండలంలోని పెగళ్లపాడు గ్రామ సమీపంలో కట్లేరులో రైల్వే బ్రిడ్జి సమీపం నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఆదివారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన షేక్ జాకీరా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పెగళ్ళపాడు రైల్వే బ్రిడ్జి వద్ద నుంచి ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పోస్టర్లు ఆవిష్కరణ



ఆత్మగౌరవ సదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ఉద్యమకారుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని తెలంగాణ ఉద్యమ ఫోరం నాయకులు అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో అమరవీరుల స్తూపం వద్ద జరిగిన కార్యక్రమంలో హైద్రాబాద్‌లో 12న జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటుకు కృషి చేసిన తెలంగాణ ఉద్యమ కారులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి అంజిరెడ్డి, ఎల్‌ఎస్ రెడ్డి, మోరంపూడి చంద్రం, అజయ్‌ఘోష్, ఆశీర్వాదం, జి.రామకృష్ణారావు, రామలక్ష్మి, శ్రీనివాస్, ప్రసాద్ గోపయ్య, హిమామ్, రవి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందించాలి

ముదిగొండ: పంటలు ఎండిపోకుండా సాగర్ కాలువ చివరి భూములకు సాగునీరు అందించాలని రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కందుల భాస్కర్‌రావు, కోలేటి ఉపేందర్‌రావులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పూర్తిస్థాయిలో సాగర్‌కాలువకు నీటి సరఫరా జరగడం లేదని అన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా చేపట్టాలని వారు కోరారు.

సర్వం సాయిమయం..

- దిన దినాభివృద్ధి చెందుతున్న సాయి మందిరం
- ఆలయంతో పాటు ఉచిత కల్యాణ మండపం ఏర్పాటు
- ప్రారంభమైన 15వ వార్షికోత్సవ వేడుకలు



అన్నారుగూడెం షిరిడీ సాయిబాబా మందిరం



ఆలయంలో ప్రతిష్ఠించిన సాయినాథుని విగ్రహం, శివలింగం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సాయి మందిరం నిర్మించడంతో అక్కడ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఒకప్పుడు గోడవలకు కేరాఫ్‌గా ఉన్న ఆ గ్రామం నేడు ప్రశాంతతో పాటు పంట పొలాలు, పాడి పరిశ్రమలతో పచ్చని వాతావరణం నెలకొంది. సాయిబాబా ఆలయం ఏర్పాటు సందర్భంగా గ్రామంలోని అందరూ ఐక్యమయ్యారు. దీంతో గ్రామంలో 2003 మార్చి 23న బాబా మందిర నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. 2008 ఫిబ్రవరి 28న ఆలయం నిర్మాణం పూర్తై ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన దిరిశాల భద్రయ్య, మల్లీడు రాఘవయ్య, మారెళ్ల లక్ష్మణ్‌రావు, దొడ్డా శ్రీనువాసరావుతోపాటు మరికొంత మంది కమిటీ సభ్యులు ఏకమై సాయి బాబా మందిరానికి శ్రీకారం చుట్టారు. దివంగత దిరిశాల భద్రయ్య కృషితో గ్రామస్తులు, దాతల సహకారంతో కోటి రూపాయలతో ఆలయం, ఆలయం ముందు మండపం, కార్యాలయం నిర్మించారు. ఆలయంలో అన్నారుగూడెం నుంచి వెళ్లిన ఎన్‌ఆర్ఐ తుమ్మలపల్లి హరిబాబు జైపూర్ నుంచి రూ.5 లక్షల విలువ కల్గిన బాబా విగ్రహాన్ని తెప్పించి ప్రతిష్ఠింపజేశారు. మందిరంలో 2021 సంవత్సరంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఆలయం దిన దినాభివృద్ధి చెందుతూ ఇక్కడ భక్తుల కొంగు బంగారంగా సాయిబాబా మందిరం పేరుగాంచింది. ఆలయం నిర్మించిన దగ్గర నుంచి గ్రామంలో ఆధ్యాత్మిక భావనతో పాటు, అభివృద్ధి జరుగుతుంది.

ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకలు



ఏక నామం భజన చేస్తున్న భక్తులు

ఆదివారం నుంచి సాయిబాబా మందిర 15వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మంగళతోరణాలతో ప్రారంభమై అభిషేకం, ఏకనామం భజన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. 27న అఖండ సాయి నామం, పల్లకి సేవ, సాయినాధుని ఊరేగింపు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 28న చివరి రోజు లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. మహా అన్నదాన కార్యక్రమం జరగనుంది. ఇందు కోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. వార్షికోత్సవ వేడుకలకు తల్లాడ, ఏన్కూరు, కల్లూరు, వైరా మండలాలకు చెందిన భక్తులు పాల్గొంటారు.

ఉచిత కల్యాణ మండపం ఏర్పాటు..

ఆలయానికి అనుసంధానంగా ఉచితంగా కల్యాణ మండపం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో సుమారు పది కుంటల స్థలంలో సాయిబాబా కల్యాణ మండపం నిర్మించారు. మండపం వెనుక వైపు వంట షెడ్డు నిర్మించారు. ఈ కల్యాణ మండపంలో ఎలాంటి శుభకార్యాలు చేసుకున్నా ఉచితంగా ఇచ్చేందుకు కమిటీ నిర్ణయించింది. మండపం వద్ద తాగునీరు, టెంట్ సామన్లు అన్ని సౌకర్యాలను సమకూర్చారు.

ప్రతి పండుగకు ప్రత్యేక పూజలు..



సాయిబాబా మందిరంలో ప్రతి పండుగకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. అంతే కాకుండా వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వార్షికోత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ సంవత్సరం వార్షికోత్సవానికి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామస్తులతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరౌతుంటారు.

– మరిగంటి ప్రవీణ్‌కుమార్, ప్రధాన అర్చకుడు

ఆలయం ఏర్పాటుతో ఆధ్యాత్మికత..



అన్నారుగూడెంలో సాయిబాబా మందిరం నిర్మించిన తర్వాత ప్రశాంత వాతావరణం నెలకొంది. అంతకు ముందు గ్రామంలో నిత్యం ఘర్షణ జరుగుతుండేది. అలాంటి గ్రామంలో బాబా గుడి కట్టిన తర్వాత అందరూ ఐక్యమై గ్రామంలో ఆధ్యాత్మిక భావన పెరిగింది. ఐక్యతకు బీజం పడింది. ఆధ్మాత్మికతతో పాటు గ్రామం అభివృద్ధి కూడా చెందుతుంది. ప్రతి ఏటా వివిధ పండుగలప్పుడు జరిగే ఉత్సవాలతోపాటు వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరుగుతాయి.

– మారెళ్ల లక్ష్మణ్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్

శాశ్వతంగా నిలిచేలా సేవలు ఉండాలి



తల్లాడలో లయన్స్‌క్లబ్ రీజియన్ మీట్‌లో మాట్లాడుతున్న పోకల చందర్

తల్లాడ: సేవా కార్యక్రమాలు సమాజంలో శాశ్వతంగా నిలిచేలా ఉండాలని లయన్స్‌క్లబ్ పీడీజీ 320 మల్టీపుల్ అడ్వయిజర్ పోకల చందర్ అన్నారు. ఆదివారం తల్లాడ ఆర్‌బీ గార్డెన్‌లో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ దారా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ రీజియన్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పోకల చందర్ మాట్లాడుతూ.. తల్లాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా దారా శ్రీనివాసరావు విశిష్ట సేవలతో పాటు సభ్యుల సంఖ్యను పెంచారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల పరిధిలోని లయన్స్‌క్లబ్‌లన్నింటి కంటే కూడా తల్లాడ లయన్స్‌క్లబ్ అత్యుత్తమ సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రీజియన్ చైర్మన్ దారా శ్రీనివాసరావు, శ్వేత దంపతులను పలువురు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోలాటం, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మల్టీపుల్ వైస్ చైర్మన్ అమృతవల్లి కోటేశ్వర్‌రావు, డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ ప్రభాకర్‌రెడ్డి, రీజియన్ అడ్వయిజర్లు మోతుకూరి మురళీదర్‌రావు, కాపా మురళీకృష్ణ, నంబూరి మదు, వనమా సూరి, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, తల్లాడ సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దారా విష్ణు, మోహన్‌రావు, కర్నాటి లక్ష్మారెడ్డి, పులబాల వెంకటేశ్వర్లు, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, అనుమోలు సర్వేశ్వరరావు, మిట్టపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

మండలంలో పొంగులేటి పర్యటన



కల్లూరురూరల్: బాధితుడికి నగదు అందిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కారేపల్లి/కల్లూరురూరల్: మండలాల్లోని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గుడితండా గ్రామంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ ధరావత్ బద్దూలాల్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కారేపల్లి క్రాస్‌రోడ్డులో ముత్యాల సురేష్ ఎలక్ట్రికల్ షాపును ప్రారంభించారు. అదే విధంగా కల్లూరు మండలంలోని వాచ్యానాయక్ తాండకు చెందిన బానోత్ భద్రు (30) అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆర్థిక సాయం అందించాడు. ఆయా కార్యక్రమాల్లో తిరుపతిరావు, సత్యనారాయణ, హనీఫ్, నాగేశ్వరరావు, శ్రీను, పాషా, సైదులు, మల్లేష్, మాన్‌సింగ్, కాటేపల్లి కిరణ్‌కుమార్, మట్టూరి జనార్దన్, లక్ష్మణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్ సంఘం నూతన కమిటీ ఎన్నిక



టీజీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, వీరభద్రం నాయక్

కారేపల్లి: తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా బానోత్ బాలాజీ, భూక్యా వీరభద్రంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కారేపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఇటీవల కారేల్లిలో జరిగిన టీజీఎస్ 3వ జిల్లా మహసభ విశేషాలు, నూతన కమిటీ ఎన్నిక, తీర్మానాలు, భవిష్యత్ కర్తవ్యాలపై భూక్యా వీరభద్రం వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా గన్యా నాయక్, గుగులోతు కుమార్, జిల్లా సహాయ కార్యదర్శులుగా బానోత్ బన్సిలాల్, తేజావత్ కృష్ణకాంత్, భూక్యా శ్రీనులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ బన్సిలాల్, కమిటీ సభ్యులు హలావత్ ఇందిరాజ్యోతి, అజ్మీర శోభన్‌నాయక్‌లు ఉన్నారు.

మండలంలో ఎమ్మెల్యే రాములునాయక్ పర్యటన

కారేపల్లి: మండలంలో వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా మాణిక్యారం గ్రామ పంచాయతీ గుడితండా గ్రామంలో మాజీ డీసీసీబీ డైరెక్టర్ ధారవత్ బద్దూలాల్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు వైరా ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆదివారం ఆశీర్వదించారు. ఆయన వెంట ఖమ్మం నగర మేయర్ నీరజ, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఉమాశంకర్, ముత్యాల సత్యనారాయణ, న్యాయవాది శ్రీనివాసరావు, అజ్మీర వీరన్న, ఐలయ్య, సర్పంచ్‌లు రంగారావు, సత్యనారాయణ, కల్పన, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

ఏన్కూరు: రైతు వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కార్మికుల, కర్షకుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ సంస్థలన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు దారదత్తం చేస్తుందన్నారు. ఈ హక్కుల సాధన కోసం ప్రజలంతా ఏకమై ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మహా సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, రాములు, లెనిన్ పాల్గొన్నారు.

జయదీప్ ముఖర్జీకి సత్కారం

సత్తుపల్లిరూరల్: ఇటీవల నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ జాతీయ ప్యాట్రాన్‌గా నియమితులైన జయదీప్ ముఖర్జీని ఆదివారం సత్తుపల్లి మండలం రేజర్లలోని న్యూసాంగ్ స్కూల్‌లో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షులు అలవాల కరుణాకర్, వేంసూరు మండల అధ్యక్షులు పాల్‌రాజు, రవి, యాకోబు, వరప్రసాద్, శ్యామ్‌సన్, రవికిరణ్, డాక్టర్ ఎబినేజర్, జాన్‌మార్క్, రమేష్, జయరాజు, జార్జీ పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనే బీజేపీ ధ్యేయం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ

ఏన్కూరు: అవినీతి నిర్మూలనే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తూతకలింగన్నపేటలో శనివారం రాత్రి స్ట్రీట్ కార్నర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశం అవినీతిలో కూరుకుపోయిందన్నారు. బంగారు తెలంగాణ చేస్తామని గద్దెనెక్కిన కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేస్తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొవ్వూరి నాగేశ్వరరావు, నల్లబోతుల రమేష్, కట్టా ఖాదర్‌బాబు, గుగులోతు శశికిరన్, చింతన బోయిన రాందాస్, చెరుకూరి నర్సింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నామా, ఎమ్మెల్యే సండ్రలకు సన్మానం



తల్లాడ: ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు గ్రామంలో ఆదివారం ఖమ్మంపార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలను సన్మానించారు. గ్రామానికి నిధులు మంజూరు చేసి అన్ని రోడ్లను సీసీ రోడ్లుగా మార్చిన నామా, సండ్రలను ఎంపీటీసీ రుద్రాక్ష బ్రహ్మం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఘన స్వాగతం పలికి నూతన దంపతులను నామా, సండ్ర ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ శ్రీనివాసరావు, ఆర్.వీరమోహన్‌రెడ్డి, నాయకులు కృష్ణార్జున్‌రావు, వీరభద్రరావు, చలపతిరావు, శ్రీనివాసరావు, రవి, వెంకటాచారి, నరసింహారావు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

కల్లూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరావు, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మండలంలోని కప్పల బంధం, బత్తులపల్లి, ఎర్రబంజరు, పుల్లయ్య బంజరు, తూర్పు లోకవరం, పడమట లోకవరం గ్రామాల్లో సీసీరోడ్డు, కమ్యూనిటీ హాల్స్, పల్లె దవాఖానాలు తదితర పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న లాల్‌మియా

ఏన్కూరు: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ మండల కార్యదర్శి ఎస్‌కె.లాల్‌మియా డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు దాటినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేరవేర్చలేదన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి, రూ.1 లక్ష రుణమాఫీ, నిరుద్యోగ భృతి, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం తదితర హామీలను తుంగలో తొక్కారని తెలిపారు. రెండువేల మంది యువకుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో భద్రత లేకుండా తన కొడుకును ముఖ్యమంత్రిని చేసుకోవడం కోసం టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకన్న, పుల్లయ్య పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: మండలంలోని బాలపేట ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రూ.8 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం జరుగుతుందని, బాలపేట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకట వీరయ్య సహకారంతో ఈ నిధులు విడుదల చేశారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోసూరి వెంకటనరసింహారావు, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, దేవేందర్, కృష్ణయ్య, నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీడీఓ మృతి

మధిర: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సూర్యాపేట జిల్లా మోతే మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేమిరెడ్డి శంకర్ రెడ్డి (58) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుమారు నెల రోజుల క్రితం శంకర్ రెడ్డి గుండెకు స్టెంట్స్ వేశారు. ఉద్యోగరీత్యా మానసిక ఒత్తిళ్లు ఉంటాయనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల సూచనలతో ఆయన స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు సన్నద్ధమయ్యారు. ఆదివారం తన స్వగృహంలో ఉప్పలమ్మ ఫంక్షన్ చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుతో ఆయన మృతి చెందారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. శంకర్ రెడ్డి మృతదేహాన్ని మధిర ఎంపీడీఓ కుడుముల విజయ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వేమిరెడ్డి వెంకట్రావమ్మ లక్ష్మారెడ్డి దంపతులు, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ కనకపుడి పెదబుచ్చయ్య, చీదిరాల వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది శీలం చెన్నారెడ్డి, మన్నేపల్లి గురునాథం తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రిలేనిరాహార దీక్షలో గుండెనొప్పితో పడిపోయిన మహిళ

కల్లూరు: కల్లూరులో డబుల్‌బెడ్‌రూమ్ గృహాల కేటాయింపులో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ.. జరుగుతున్న లబ్ధిదారుల రిలే నిరాహారదీక్ష ఆదివారానికి 5వ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో గోపాలకుంటకు చెందిన బోగన బోయిన వెంకటనర్సమ్మ ఒక్కసారిగా గుండెనొప్పితో పడిపోయింది. ఆ మహిళను తోటి లబ్ధిదారులు పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆ మహిళకు ఏ ప్రమాదం జరిగినా ప్రభుత్వం, అధికారులదే బాధ్యత అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ హెచ్చరించారు. లబ్ధిదారులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆగేదిలేదన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



కల్లూరు ప్రభుత్వాస్పత్రిలో శ్రమదానం చేస్తున్న క్రైస్తవులు

కల్లూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లిటిల్ ఫ్లవర్ చర్చి కల్లూరు విచారణ గురువు రెవ.ఫాదర్ విన్సెంట్ అన్నారు. ఆదివారం కల్లూరు లిటిల్‌ఫ్లవర్ చర్చ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఆవరణలోని చెత్తను తొలగించి శుభ్రం చేశారు. 40 రోజుల దీక్షకాలంలో ప్రతినిత్యం దైవ ప్రార్థనలో పాల్గొనాలని, ప్రేమ త్యాగం నిలయంగా క్రైస్తవ జీవితాన్ని నడుపుతూ దైవ కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్లూరు విచారణ లిటిల్ ఫ్లవర్ స్కూల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ రెవ.ఫాదర్ లూర్దు, సహాయ గురువులు ఫాదర్ దేవదాసు, కౌన్సిల్ సభ్యులు, పలు గ్రామాల నుంచి క్రైస్తవ భక్తులు హాజరయ్యారు.

ముగిసిన రేషన్ డీలర్ల అర్హత పరీక్ష



కొణిజర్ల పరీక్ష కేంద్రంలో పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ రవీంద్రనాథ్

కొణిజర్ల: మండలంలో రేషన్ డీలర్ల నియామకం కొరకు నిర్వహించిన అర్హత పరీక్ష ఆదివారం కొణిజర్లలో ప్రశాంతంగా ముగిసింది. కొణిజర్ల మండలంలో అంజనాపురం, లక్ష్మీపురం, అన్నవరం తుమ్మలపల్లి-2, కొణిజర్ల-3, తనికెళ్ల-3, అనంతారం, సింగరాయపాలెం-2, గద్దలగూడెం, మెకాలకుంట, పంచాయతీలలో 10 రేషన్ దుకాణాల నిర్వహణకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 102 హాజరయ్యారు. ఆర్డీఓ రవీంద్రనాథ్ స్వయంగా పరీక్ష కేంద్రంలో పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. అర్హత పరీక్షలో అర్హత సాధించిన వారిలో ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేయడం జరగుతుందన్నారు. డీఏఓ జగదీష్, ఆర్ఐ సునీత, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, కొణిజర్ల రెవెన్యూ సిబ్బంది పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

వైరా: వైరా ప్రభుత్వ పాఠశాలలో 1985–86 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తమ పూర్వ స్నేహితులను కలుసుకుని ఆనందంగా గడిపారు. వృత్తి రిత్యా పలుచోట్ల పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు కలుసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య పాత్ర పోషించిన వారిలో రాయల కృష్ణారావు, మిట్టపల్లి నాగి, కొమిరిశెట్టి శ్రీధర్, దార్ల రాజా, మిట్టపల్లి శివ, తదితరులున్నారు.